అఖండుడితో అయిదు నిమిషాలు 23-12-49

# సినిమా విమర్శలు

నేను మద్రాసులో ఉంటే ప్రతి ప్రివ్యూకూ నన్ను పిలిచి ఉండేవాళ్లు. విమర్శలు గానే వాళ్ళందరికీ సినిమాలు ఊరికే చూపిస్తారు మద్రాసులో. నేను మా దిక్కుమాలిన దౌర్భాగ్యపు స్వగ్రామంలో ఉండటం చేత రివ్యూ రాయాలంటే చేతి చమురు వదిలించుకోవాలి. రివ్యూ ప్రకటించేవాళ్లు టిక్కెట్టు ఖర్చులన్నా ఇచ్చుకోరాయె. (ఆ మాట పైకి అనరాదు! 'నీ రివ్యూ మా కక్కర్లేదు పో!" అంటే నేనేం కావాలి!)

సరే, ఏం చేస్తాం? సినిమాహాలు దగ్గిరికి వెళ్లా. కోటిగాడి దగ్గిర సోడా తాగుదా మనుకున్నా. కాని ఎందుకని మానేశా. కిళ్లీ అన్నా వేసుకోక పోతే బాగుండదనిపించింది. అయినా నేనేమన్నా పదణాల టిక్కెట్టుకొనే బూర్జువానా? అందుకని కిళ్లీకూడా మానేశా. నేల కిటికీదగ్గిరికి వెళ్ళి నేల టిక్కెట్టు కొన్నా. లోప లికి వెళ్ళి కూర్చున్నా. బోలెడంత డబ్బున్న సేఠయ్యకూడా నేలటిక్కెట్టే కొన్నాడు పిసినిగొట్టు వెధవ!—




చిత్రం ఆరంభించారు. తెరమీద టైటిల్సు చూడగానే ఈ చిత్రం ఎంత బోగో తెలిసి పోయింది. తెరమీద నాలుగు పేర్లు కనిపించే సరికి వాళ్లు చాలా గొప్పవాళ్లు కాబోలనుకుం టాం. అన్నీ పట్టిడి. నామాదిరిగా మద్రాసు వెళ్ళి ఒక్కసారి వీళ్ళందర్నీ చూసివచ్చిన వాడికి తెలుస్తుంది ఆ సంగతి.

ఈ పాడు చిత్రంలో హాస్యంకూడా ప్రవేశ పెట్టారు. ఆ హాస్యం వచ్చినప్పుడల్లా ప్రేక్షకు లంతా వెర్రి వెధవల్లే నవ్వటం! ఎందుకో నా కర్థం కాలేదు. నేను హాస్య రచయిత లందరి పుస్తకాలూ చదివాను. నాకెన్నడూ నవ్వు రాలేదు. షేక్స్పియరు చెప్పినట్టు పేరులో ఏముంది?

ఈ చిత్రం డైరెక్టు చేసినవాడు చాలా గొప్ప వాణ్ణనుకుంటాడు. ఇటువంటిఆడవారకాన్నికొన్ని సినిమా పత్రికలు గొప్పచేస్తున్నాయి. అమాయకు లైన పెట్టుబడిదార్లు పాపం ఈసినిమాపత్రికలను నమ్మి వీళ్ళను డైరెక్టర్లుగా పెట్టుకుంటున్నారు. యూక్లిడ్ మహాశయుడు చెప్పినట్టు త్రికోణం యొక్క రెండు భుజాలు ఏకమైతే మూడో భుజం ఎక్కడ ఎక్కి వస్తుంది?

ఈ మూడోతరగతి చిత్రంలో అభ్యుదయం అనేమాట వినిపించక పోయినా కనిపిస్తున్నది. చిత్రనిర్మాతలకు కమ్యూనిస్టు తెగులు సోకి నట్టుంది. ఇటువంటి పచ్చి కమ్యూనిస్టు ప్రచా రాన్ని సెన్సారు వారెందుకు కత్తిరించ లేదో తెలియదు.

నిజంగా సినిమా చిత్రాలు తీస్తే మహా రాష్ట్రులు తియ్యాలి, లేదా బెంగాలీ వాళ్ళు తీయాలి, లేదా సిక్కులూ, పార్సీలూ, గుజరాతీలూ, తుర్గులూ, జాట్లూ, కోండ్లూ, గమార్లూ తీయాలి. అంతేగాని నా జాతికి చెందిన తెలుగు బ్రభాజమానాలు చిత్రాలు తీయుట ఏమిటి? నెస్ఫీల్డు మహాశయుడు చెప్పినట్టు అకర్మక క్రియకు కర్మ ఏమిటి?

ఇంటర్వల్ ఎప్పుడు వస్తుందా అని కని పెట్టుకు కూర్చున్నాను. నావెనక ఎవరో నవ్వు తున్నారు. నన్ను చూసేనేమో. ఊరుకోం డయ్యా అంటే కరవొచ్చారు. వాళ్ళదేం పోయింది? వాళ్లేమన్నా రివ్యూ రాయాలా ఏమన్నానా? వాళ్లు శ్రద్ధగా చూడరు. ఇతరు లను చూడనివ్వరు. పైగా నేను ఊరుకోమన్న తరవాత మరీ అల్లరి సాగించారు. అందుకని ఇంటర్వలు రాగానే లేచి ఇంటికి వెళ్లిపోయాను. కార్లైలు చెప్పినట్లు మనం ఘనమైన మౌనాన్ని ఆరాధించుదాం.